@netifocusnews @focustv

http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శుక్రవారం 26, జూలై 2024 || పేజీలు: 04



## పింఛన్ల పెంపు మాటే లేదు: కేటీఆర్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

ప్రభుత్వం ప్రకటించిన 2024-25 బడ్జెట్‌లో వయోవృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలకు ఇచ్చే పింఛను పెంపు మాటేలేదని, నిరుద్యోగ భృతి రూ.4వేలకు సంబంధించిన అంశమే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టింది 'దోకేబాజ్ బడ్జెట్' అంటూ ఆయన విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌పై గురువారం ఎక్స్ వేదికగా ఆయన మిగతా 2లో..

## గ్యారెంటీలకు నిధులేవి?

- సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులేవని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. కాంగ్రెస్.. ఎన్నికల్లో మిగతా 2లో..



## చివరి దశలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జూలై 25:

నీటిపారుదల శాఖకు రూ.22,301 కోట్లు కేటాయించడాన్ని ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్వాగతించారు. ఈ నిధులతో చివరి దశలో ఉన్న ఆరు సాగునీటి ప్రాజెక్టులు పూర్త య్యేలా చూస్తామని వెల్లడించారు. అలాగే పౌర సరఫరాల శాఖకు రూ.3,836 కోట్లు కేటాయించడాన్ని స్వాగతించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మార్చే స్పష్టమైన విజన్.. బడ్జెట్లో కనిపించిందన్నారు.

# సంక్షేమ బడ్జెట్

## రూ.2,91,159 కోట్లతో తెలంగాణ బడ్జెట్



- రెవెన్యూ వసూళ్లు రూ.2,21,242 కోట్లు
- రెవెన్యూ వ్యయం రూ.2,20945 కోట్లు
- రెవెన్యూ మిగులు రూ.297కోట్లు
- ద్రవ్యలోటు రూ.49,255 కోట్లు

- వివిధ సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగానికి రూ.1.10 లక్షల కోట్లు
- ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాల సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట
- ఆరు గ్యారంటీలకు రూ.47,167 కోట్లు
- గ్రేటర్ హైదరాబాద్ నగర అభివృద్ధికీ ప్రాధాన్యం
- రాష్ట్ర ఆదాయం పెంపుపై దృష్టి
- పన్నుల రాబడి 24% పెరుగుతుందని బడ్జెట్ అంచనా..

### అసెంబ్లీలో ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసన సభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159 కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా మిగతా 2లో..



## సాగుకు ప్రాధాన్యం

- బడ్జెట్‌లో నిధుల కేటాయింపే నిదర్శనం
- ఈ ఏడాది ఫసల్ బీమా యోజనలోకి రాష్ట్రం
- పంటలు సాగు చేసే అర్హులకే రైతు భరోసా
- ఈ ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- త్వరలోనే ఉద్యోగ నియామక క్యాలెండర్
- బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి

➤ వివరాలు 02లో..



## హైదరాబాద్ అభివృద్ధికి రూ.10వేల కోట్లు!

- విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం
- పలు మార్గాల్లో మెట్రో విస్తరణకు నిధులు
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో మార్పు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

తెలంగాణ బడ్జెట్‌లో హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఎన్నడూ లేని విధంగా రూ.10వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది., జలమండలి, మెట్రో రైలు విస్తరణతో పాటు మూసీ ప్రక్షాళనకు భారీ నిధులు ప్రకటించింది. ఓఆర్ఆర్ అభివృద్ధికి రూ.200కోట్లు కేటాయించడమే కాకుండా.. ప్రాంతీయ వలయ రహదారిని హైదరాబాద్ నగర నలుమూలలా జాతీయ రహదారులతో అనుసంధానం చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించింది. మిగతా 2లో..




## బడ్జెట్‌పై చీల్చి చెండాడతాం

- బడ్జెట్‌పై అంతా ట్రాష్.. పాలసీ అంటూ లేదు
- ప్రస్తావన లేని గొర్రెల పథకం.. దళిత బంధు
- రైతు బంధు, భరోసాలో ఆంక్షలతో మోసం చేశారు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శలు
- పదేళ్లలో తొలిసారి మీడియా పాయింట్‌కు మాజీ సీఎం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

"బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం రైతుల్ని వంచించింది. వృత్తి కార్మికుల్ని వంచించింది. అంతా ట్రాష్. గ్యాస్. ఈస్ట్‌మన్ కలర్ మాదిరిగా చెప్పారు. ఓ కథ చెప్పినట్లు ఉంది. చిల్లర మల్లర స్పీచ్‌లా ఉంది. బడ్జెట్ ప్రసంగంలా లేదు. పారిశ్రా మిక పాలసీ లేదు. ఐటీ పాలసీ లేదు. పేదలకు సంబం ధించి ఈ సర్కారుకు ఓ పాలసీ అంటూ లేదు. ఇది పేదల బడ్జెట్ కాదు. రైతు బడ్జెట్ కాదు. ఎవరి బడ్జెట్ అనేది విశ్లేష ణలో తెలుస్తుంది. భవిష్యత్తులో దీన్ని చీల్చి చెండాడతాం" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. అంకెలను ఒత్తి ఒత్తి మిగతా 2లో..



## జూరాలకు భారీ వరద

### 42గేట్లు ఎత్తి నీటి విడుదల

మహబూబ్‌నగర్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 42గేట్లు ఎత్తివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2.06లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయం నుంచి 1.97లక్షల క్యూక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో స్పిల్‌వే ద్వారా 1.69లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 24,201 క్యూసెక్కులు, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్‌కు 1300 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిట్టం 318.51 మీటర్లు కాగా ఇప్పుడు 316.71 మీటర్ల వద్ద నీరు ఉన్నది. అదేవిధంగా ప్రాజెక్టులో మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
శుక్రవారం 26, జూలై 2024

# గ్యారెంటీలకు నిధులేవి?

(మొదటి పేజీ తరువాయి..)

గ్యారెంటీల గారడీ చేసిందని, ఇప్పుడు బడ్జెట్‌లో అంకెల గారడీ చేసింది తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఆసరా పింఛన్లు పెంచుతామన్నారు, బడ్జెట్‌లో మాత్రం నిధులు పెంచలేదు. ఆటో కార్మికులకు రూ.12 వేలు, రూ.4వేల నిరుద్యోగ భృతి, మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసేలేదు. కొత్త రేషన్ కార్డుల ప్రస్తావన లేదు. రూ.57వేల కోట్లు అప్పు తెస్తామంటున్నారు. ఇది మా ప్రభుత్వం కన్నా రూ.17వేల కోట్లు ఎక్కువ. నెలకు రూ.7వేల కోట్ల వడ్డీ కడుతున్నామని రాష్ట్ర ఆర్థికమంత్రి చెబుతున్నారు. బడ్జెట్ కాపీలో మాత్రం వచ్చే ఏడాదికి చెల్లించాల్సిన వడ్డీ రూ.17,729 కోట్లని చూపించారు. ఇందులో ఏది నిజమో చెప్పాలి. ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో దానికి రూ.15,470కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులతో ఒకేసారి మాఫీ ఎలా సాధ్యం" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆత్మస్తుతి, పరనిందతప్ప ప్రభుత్వ మొదటి బడ్జెట్‌లో ఎలాంటి దశా దిశాలేదని ఆయన విమర్శించారు.

# పించన్ల పెంపు మాటే లేదు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి..)

స్పందించారు. బడ్జెట్‌లో ఎటువంటి విధానాలు పాటించలేదని, 6గ్యారెంటీల అమలును ఎక్కడా ప్రస్తావించలేదని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై శ్రద్ధ చూపలేదని, మౌలిక వసతులకు ఏమాత్రం నిధులు కేటాయించలేదని అన్నారు. నేతన్నలు, ఆటో డ్రైవర్లకు అండా దండా చూపని దండగమారి బడ్జెట్ ఇదని విమర్శించారు.

# హైదరాబాద్ అభివృద్ధికి రూ.10వేల కోట్లు!

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ను గురువారం ఆయన అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి భారీగా రూ.10వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1500 కోట్లు, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు రూ.1,525 కోట్లు, పాతబస్తీ మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, మెట్రో వాటర్ వర్క్స్ రూ.3,385 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి పొందుతున్నవారికి కార్యాలయాలకు దగ్గరగా, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాన్ని నగరం చుట్టూ ప్రోత్సహిస్తాం. ఈ టౌన్‌షిప్ లలో సరసమైన ధరల్లో పేద, మధ్యతరగతి వారికి అనుకూలమైన నివాసగృహాల నిర్మాణాలను అందించేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం మూడు ట్రాఫిక్ కారిడార్లలో మెట్రో సౌకర్యం ఉంది. వివిధ వర్గాల అవసరాలను తీర్చడంతో పాటు నగరంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో, ప్రభుత్వం 78.4 కి.మీ. పొడవున్న 5 అదనపు కారిడార్లను రూ.24,042 కోట్లతో అభివృద్ధి పరుస్తుంది. ఇందులోభాగంగా మెట్రో రైలును పాతనగరానికి పొడిగించి దానిని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేస్తామన్నారు. ప్రస్తుతమున్న కారిడార్లను నాగోలు నుంచి ఎల్.బి.నగర్ వరకు విస్తరిస్తాం. నాగోలు, ఎల్.బి నగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ ఛేంజ్ స్టేషన్లగా అభివృద్ధి చేస్తాం. మియాపూర్ నుంచి పటాన్ చెరువుకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని కూడా ప్రణాళిక సిద్ధం చేశాం. హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు వరకు గల ప్రాంతాలను కోర్ అర్బన్ రీజియన్‌గా గుర్తించి వాటి అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తాం. ఔటర్ రింగు రోడ్డును నగర సరిహద్దుగా పరిగణిస్తాం. ఓఆర్ఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణకు ఒక ఏకీకృత సంస్థ ఏర్పాటు. జీహెచ్ఎంసీ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. పట్టణ విపత్తులను నివారించడానికి, వాటిని ఎదుర్కొనడానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయం. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీ. పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం. నదీ తీర ప్రాంతంలో కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు, పాత హెరిటేజ్ ప్రాంతాలకు కొత్త సొబగులు అద్దుతామన్నారు. మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి. లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివాహక అభివృద్ధి తరహాలో మూవీ అభివృద్ధి. హైదరాబాద్ నగరాభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూ.1,500 కోట్లు ప్రతిపాదన చేశారు. హెచ్ఎండిఎ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు కేటాయించారు. మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు. మెట్రో వాటర్ వర్క్సకి రూ.3,385 కోట్లు ప్రతిపాదన. హైడ్రాకి రూ.200 కోట్లు, ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డు కోసం రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకి రూ.500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకి రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ కోసం రూ.50 కోట్లు కేటాయించారు. రీజనల్ రింగ్ రోడ్‌తో అభివృద్ధి మరింత వేగవంతం. ఉత్తర ప్రాంతంలోని 158.6 కి.మీ. పొడవున్న సంగారెడ్డి- తూప్రాన్ - గజ్వేల్ - చౌటుప్పల్ రోడ్డును, దక్షిణ ప్రాంతంలోని 189 కి.మీ.ల పొడవున్న చౌటుప్పల్ -షాద్ నగర్-సంగారెడ్డి రోడ్డును, జాతీయరహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదన. రీజనల్ రింగు రోడ్డు హైదరాబాద్ నగర ఉత్తర-దక్షిణ ప్రాంతాలనూ, తూర్పు- పశ్చిమ ప్రాంతాలనూ కలుపుతూ జాతీయరహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానం చేస్తామని అన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే ప్రమాణాలను దృష్టిలోఉంచుకొని దీని నిర్మాణా నికి తగినంత భూమిని సేకరించే ప్రయత్నం.

# సంక్షేమ బడ్జెట్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

అభివృద్ధి, సంక్షేమ రంగాలను పరుగు పెట్టించేలా..వ్యవసాయాన్ని గాడిలో పెట్టించేలా.. అనేక రంగాలను భ్రష్టు పట్టించి, అప్పులు చేసిన తెలంగాణను తలెత్తుకునేలా చేసేలా...కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి వార్షిక బడ్జెట్‌ను గురువారం అసెంబ్లీకి సమర్పించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో దివాళా తీయించిన క్రమంలో మళ్లీ పట్టాలకు ఎక్కించేలా ప్రభుత్వం పూనుకుందని చెబుతూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మండలిలో మంత్రి శ్రీదర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎన్నికలు ముగిసి, కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరవాత.. కేటాయింపులు ఏవీ లేకపోయిన సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆరుగ్యారెంటీల అమలు, ఇచ్చిన హామీలు పూర్తి చేయడం, అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రకటిస్తూ.. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూల ధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికే సింహభాగం ప్రకటించారు. రూ.72,659 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇది రైతుల తలరాతలు మార్చే చరిత్రాత్మక నిర్ణయమన్నారు. దేశ చరిత్రలో వ్యవసాయరంగానికి ఇది ఒక మైలురాయి అని తన ప్రసంగంలో పేర్కొన్నారు. రైతు భరోసా సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని, బడ్జెట్‌అంటే.. కేవలం అంకెల సమాహారం కాదు. విలువలు, ఆశల వ్యక్తీకరణ కూడా అంటూ ప్రకటించారు. జిల్లాల మధ్య ఆదాయ అంతరాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. అసమానతలు లేని సమసమాజ స్థాపన దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ ఏడాదిలోనే రైతు కూలీలకు రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమం చేపడతాం అని అన్నారు. పీఎం ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయించాం. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. పైసా ఖర్చు లేకుండా పంటలకు పూర్తి భద్రత కల్పిస్తాం. వరి రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించాం. ఆయిల్‌పామ్ రైతులకు అవసరమైన సాయం అందిస్తాం. 2024-25 సంవత్సరానికి రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ఆ పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 77,857 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగ్గా.. 23,131 ఎకరాలకు అనుమతులిచ్చాం' అని భట్టి విక్రమార్క చెప్పారు.

**రాష్ట్ర బడ్జెట్ స్వరూపమిదీ..**

- ఆర్థిక లోటు అంచనా రూ.49,255.41 కోట్లు
- ప్రాథమిక లోటు అంచనా రూ.31,525.63 కోట్లు
- రెవెన్యూ మిగులు అంచనా రూ.297.42 కోట్లు
- వ్యవసాయానికి రూ.72,659 కోట్లు
- ఉద్యానశాఖకు రూ.737కోట్లు
- పశుసంవర్ధశాఖకు రూ.1,980కోట్లు
- రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ. 723కోట్లు
- గృహజ్యోతికి రూ.2,418కోట్లు
- ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836కోట్లు
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.29,816 కోట్లు
- రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు రూ.1,525 కోట్లు
- స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు
- ఎస్సీ సంక్షేమం రూ.33,124కోట్లు
- ఎస్టీ సంక్షేమం రూ.17,056కోట్లు
- మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు
- బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు
- వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు
- ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు
- అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు
- పరిశ్రమల శాఖకు రూ 2,762 కోట్లు
- ఐటీ శాఖకు రూ.774 కోట్లు
- నీటిపారుదల రంగానికి రూ.22,301 కోట్లు
- విద్యకు రూ.21,292 కోట్లు
- హోంశాఖకు రూ.9,564కోట్లు
- రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790 కోట్లు

# సాగుకు ప్రాధాన్యం..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

కాంగ్రెస్ ప్రభుత్వం ముందునుంచీ చెబుతున్నట్లుగానే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను మొత్తం రూ.2,91,159 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అత్యధికంగా రూ.72,569 కోట్లను వ్యవసాయ రంగానికే కేటాయిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి తాము ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామనేదానికి ఈ కేటాయింపులే నిదర్శనమన్నారు. గురువారం శాసనసభలో బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం ప్రవేశపెట్టారు. మధ్యాహ్నం 12:02 గంటలకు ప్రారంభమైన బడ్జెట్ ప్రసంగం 1:57 గంటలకు ముగిసింది. భట్టివిక్రమార్క ప్రసంగిస్తూ.. సంకల్ప బలం, చిత్తశుద్ధి, సమర్థత, నిజాయతీ పునాదులుగా ఏర్పడిన ప్రభుత్వానికి అలవికాని హామీలేవీ లేవని నిరూపించామన్నారు. ప్రజల ఆకాంక్షలతో కాంగ్రెస్ ఆశయాలను సమన్వయపరిచి.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరచాలనే దృఢ దీక్షతో ఉన్నామన్నారు. ప్రభుత్వ విధానాలు పారదర్శకంగా, ప్రజల భాగసామ్యంతో ఖరారు కావాలే తప్ప.. నాలుగు గోడల గడీల మధ్య కాదని వ్యాఖ్యానించారు.

**సన్నరకం ధాన్యానికి బోనస్..:** రాష్ట్రంలో సన్నరకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి వీలుగా 33 రకాల సన్నాలను గుర్తించి, క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. దీంతోపాటు భూమిలేని రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులను మార్చడానికిగాను వారికి ఏటా రూ.12 వేల చొప్పున అందజేస్తామన్నారు. ఇక ఈ ఏడాది నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో చేరనున్నామని, ఈ పథకం కింద రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతుల రూ.2 లక్షల రుణమాఫీకిగాను రూ.31 వేల కోట్లను సమీకరించుకుంటున్నట్లు తెలిపారు. రూ.లక్ష దాకా రుణం ఉన్న 11.34 లక్షల మంది రైతులకు ఈ నెల 18నే మాఫీ చేశామని, పూర్తి నిధులను త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించారు. ఇక రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేయనున్నట్లు వెల్లడించారు. పంటలు సాగుచేసే, అర్హులైన రైతులకే ఈ సాయం అందించనున్నట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ధాన్యాన్ని సేకరణ కేంద్రాలకు తరలించేలా గంటగంటకూ వాతావరణ సమాచారం తెలియజేసే యాప్ అభివృద్ధి చేస్తున్నామన్నారు.

**వామనావతారంలా అప్పులు..:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.75,577 కోట్లుగా ఉన్న అప్పు.. రోజు రోజుకూ వామనావతారంలా పెరిగిపోయిందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. గతేడాది డిసెంబరు నాటికి ఈ అప్పులు రూ.6,71,757 కోట్లకు చేరాయని తెలిపారు. గత దశాబ్దకాలంలో తప్పుడు నిర్ణయాల వల్ల సాగునీటి ప్రాజెక్టుల్లో ఆశించిన ఫలితాలు సాధించలేదన్నారు. కాలువల ద్వారా నీళ్లు కాకుండా.. అవినీతి సొమ్మును ప్రవహింపచేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పనిచేసిందని ఆరోపించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడంతో.. ఎంతో సమృద్ధిగా, ఆర్థికంగా పరిపుష్టిగా ఉన్న రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. కనీసం ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్లకు చెల్లింపులు కూడా సకాలంలో చేయలేకపోయారని ఆక్షేపించారు. తాము దుబారా ఖర్చులను కట్టడి చేసి, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని, ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తారీకున వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాకంతో అప్పులు చెల్లించడానికి కూడా మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

**త్వరలోనే జాబ్ క్యాలెండర్..:** గత దశాబ్ద కాలంలో ఉద్యోగ నియామకాల విషయాన్ని పక్కనపెడితే.. అరకొర నియామకాల్లోనూ అక్రమాలు, పేపర్ లీకేజీలు చోటుచేసుకున్నాయని ఉపముఖ్యమంత్రి ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను సమూలంగా ప్రక్షాళన చేశామని, ఇప్పటిదాకా 31,768 మందికి ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. నియామక ప్రణాళిక క్యాలెండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. సొంత జాగా ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇల్లు కట్టుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో 4.50 లక్షల మందికి ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 63 లక్షల మంది మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకుగాను 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. స్త్రీ నిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానం ద్వారా రూ.లక్ష కోట్ల సాయం అందించాలన్నది లక్ష్యమన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి రూ.50,180 కోట్లు

- దళిత బంధుకు రూ.2వేల కోట్లు..
- మేడారం జాతరకు రూ.52 కోట్లు
- కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌కు రూ.3,585 కోట్లు
- బీసీ శాఖకు రూ.9,200 కోట్లు..
- మహిళా, శిశు సంక్షేమానికి రూ.2,736 కోట్లు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్టీ, ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక నిధుల కింద రూ.50,180 కోట్లు కేటాయించింది. ఇందులో ఎస్సీల ప్రత్యేక నిధికి రూ.33,124 కోట్లు, ఎస్టీకి రూ.17,056 కోట్లు ఇచ్చింది. 2023-24 బడ్జెట్‌లో ఎస్టీ ప్రత్యేక నిధికి రూ.15,232 కోట్లు, ఎస్సీలకు రూ.36,750కోట్లు కలిపి మొత్తం రూ.51,982 కోట్లు కేటాయింపులు జరిగాయి. వాటితో పోలిస్తే ఈసారి కేటాయింపులు స్వల్పంగా తగ్గాయి. గత బడ్జెట్‌తో పోలిస్తే బీసీ సంక్షేమానికి, మహిళా, శిశు సంక్షేమ శాఖకు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు కేటాయింపులు ఈసారి స్వల్పంగా పెరిగాయి.దబీసీ సంక్షేమ శాఖకు అనుబంధంగా ఉన్న వివిధ కులాల కార్పోరేషన్లకు గత ప్రభుత్వం కేటాయించిన విధంగానే రూ.50కోట్లు, రూ.65కోట్ల చొప్పున కేటాయించగా, వెనుకబడిన కులాల కార్పోరేషన్ (ఎంబీసీ)కు రూ.400కోట్లు, బీసీ కార్పోరేషన్‌కు రూ.700 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో బీసీ శాఖకు రూ. 6,229 కోట్లు ఇవ్వగా ఈ సారి రూ.9,200 కోట్లు ఇచ్చారు. ఎస్సీ సంక్షేమ శాఖకు రూ.7,638 కోట్లు కేటాయించారు. దళితబంధు పథకానికి బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ.21,072కోట్లను కేటాయించగా అందులో రూ.17,700 కోట్ల మేర నిధులను దళిత బంధుకు ఇచ్చారు. ఇక, ప్రస్తుత బడ్జెట్‌లో గిరిజన సంక్షేమశాఖకు రూ.3,969 కోట్లు, మహిళా, శిశు సంక్షేమ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ శాఖకు రూ.2,736 కోట్లు కేటాయించారు. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు ఈ బడ్జెట్‌లో రూ.3,585 కోట్లు కేటాయించగా 2023-24లో జరిగిన కేటాయింపుల కంటే ఇది రూ.375కోట్లు అదనం. ఇక, మేడారం జాతరకు సర్కారు రూ.52 కోట్లు కేటాయించింది.

**గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు..:** ఎస్సీ సమీకృత గురుకులాల నిర్మాణానికి రూ.2వేల కోట్లు, గిరిజన గురుకుల ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.200కోట్లు, బీసీ రెసిడెన్షియల్ హైస్కూల్, జూనియర్ కళాశాలలకు రూ.307 కోట్లు కేటాయించింది. కొత్తగా ఏర్పాటైన గిరిజన తండాల గ్రామ పంచాయతీల్లో.. పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.300కోట్లు, గిరిజన ఆవాసాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.200కోట్లు, రహదారి సౌకర్యం లేని తండాలకు రహదారుల కల్పనకు రూ.150కోట్లు ఇచ్చారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిపలు, విదేశీ విద్యానిధి పథకం అమలుకు కూడా నిధులు కేటాయించారు.

# బడ్జెట్‌పై చీల్చి చెండాడతాం

- అంతా ట్రాష్.. పాలసీ అంటూ లేదు
- ప్రస్తావన కూడా లేని గొర్రెల పథకం.. దళిత బంధు
- ఇది రైతు శత్రు ప్రభుత్వం.. పొగుడుతూనే వెన్నుపోటు
- రైతు బంధు, భరోసాలో ఆంక్షలతో మోసం చేశారు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శలు
- పదేళ్లలో తొలిసారి మీడియా పాయింట్‌కు మాజీ సీఎం



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 25:

"బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం రైతుల్ని వంచించింది. వృత్తి కార్మికుల్ని వంచించింది. అంతా ట్రాష్. గ్యాస్. ఈస్ట్‌మన్ కలర్ మాదిరిగా చెప్పారు. ఓ కథ చెప్పినట్లు ఉంది. చిల్లర మల్లర స్పీచ్‌లా ఉంది. బడ్జెట్ ప్రసంగంలా లేదు. పారిశ్రామిక పాలసీ లేదు. ఐటీ పాలసీ లేదు. పేదలకు సంబంధించి ఈ సర్కారుకు ఓ పాలసీ అంటూ లేదు. ఇది పేదల బడ్జెట్ కాదు. రైతు బడ్జెట్ కాదు. ఎవరి బడ్జెట్ అనేది విశ్లేషణలో తెలుస్తుంది. భవిష్యత్తులో దీన్ని చీల్చి చెండాడతాం" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. అంకెలను ఒత్తి ఒత్తి పలకడం తప్ప ఆర్థిక మంత్రి కొత్తగా చెప్పిందేమీ లేదన్నారు. శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా గురువారం ఆయన అసెంబ్లీకి వచ్చారు. బడ్జెట్ ప్రసంగం 12:02 గంటలకు ప్రారంభం కాగా.. 25 మంది పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి 12:04 గంటల సమయంలో ఆయన సభలోకి అడుగుపెట్టారు. బడ్జెట్ ప్రసంగం 1:50 గంటలకు ముగియగా.. దానికంటే రెండు నిమిషాల ముందే బయటికి వెళ్లిపోయారు. అనంతరం పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు.

"బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లేలా ఉంది. ఏ ఒక్క వర్గానికి స్పష్టమైన హామీ లేదు. రైతులను పొగుడుతున్నట్లు పొగుడుతూనే వెన్నుపోటు పొడిచింది. రైతు బంధు, భరోసాలో అనేక ఆంక్షలు పెట్టబోతున్నట్లు చెప్పి రైతుల్ని మోసం చేశారు. గతంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించి అనేక పథకాలు ప్రవేశపెట్టాం. ఒక్క పథకంపై కూడా ఇప్పుడు స్పష్టత లేదు. యాదవులకు గొర్రెల పెంపకం పథకం మూసివేసినట్లు అర్థమవుతోంది. దళిత బంధు పథకం ప్రస్తావన లేదు. దళిత సమాజంపై నిర్లక్ష్యానికి ఇంతకంటే మరో నిదర్శనం అవసరం లేదు. మత్స్యకారులకు మాత్రమే కాదు.. ఎవరికీ చెప్పుకోదగ్గ భరోసా లేదు" అని దుయ్యబట్టారు. ఒక్క కొత్త సంక్షేమ పథకం లేదని, మహిళల పథకాలపైనా స్పష్టత లేదని విమర్శించారు. "దురదృష్టం ఏమిటంటే.. ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత 6 నెలలు సమయం ఇవ్వాలనుకున్నాం. రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణకు రెండు దఫాలు రైతు బంధు ఇచ్చాం. వీరు ఎగ్గొడతామంటున్నారు. రైతులకు ఇచ్చిన డబ్బులను దుర్వినియోగం చేసినట్లు దురదృష్టకరమైన వ్యాఖ్యలు చేశారు. ఇది రైతు శత్రు ప్రభుత్వం" అని మండిపడ్డారు. ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని, విద్యుత్తు, నీరు సరఫరా చేయడం లేదని, చాలా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతు బంధు, రైతు భరోసా ఎప్పు డు ఇస్తారని అడిగితే కనీసం సమాధానం చెప్ప డం లేదని విమర్శించారు. మీడియా కేసీఆర్‌ను పలు అంశాలపై ప్రశ్నించేందుకు ప్రయత్నించగా.. తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు.

**పదేళ్లలో తొలిసారి మీడియా పాయింట్‌కు...**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో తొలిసారి కేసీఆర్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్లు సీఎం హోదాలో ఉన్న ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడే సందర్భం రాలేదు. గత ఏడాది డిసెంబరులో అధికారం కోల్పోయి.. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పటికీ ఆయన అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాలేదు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసేందుకు వచ్చినా.. మీడియాతో మాట్లాడలేదు. అంతకుముందు ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీలోకి వచ్చిన కేసీఆర్‌కు పార్టీ ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి నేరుగా ఆయన తన కొత్త చాంబర్‌కు చేరుకున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతకు ప్రభుత్వం అసెంబ్లీ ఆవరణలోని ఔటర్ లాబీలో ప్రత్యేక చాంబర్ కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే, ఇన్నర్ లాబీలోని చాంబర్‌ను తమకు కేటాయించాలని బీఆర్ఎస్ కోరినా ప్రయోజనం లేకుండాపోయింది. ప్రస్తుత చాంబర్ చిన్నదిగా ఉందని, గతంలో ఉన్నట్లు ఇన్నర్ లాబీలోనే కేటాయించాలని బీఏసీ సమావేశంలో కూడా కోరారు. ఈ నేపథ్యంలో, తొలిసారిగా అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ పది నిమిషాలపాటు కొత్త చాంబర్‌లో ఉన్నారు.





# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



15-19

### ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** మున్సిపాలిటీలు, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. గురువారం వనపర్తి, పాన్గల్ మండలాల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. వనపర్తి మున్సిపాలిటీలోని 10వ వార్డులో తిరిగి డ్రైన్ల పరిస్థితి పరిశీలించారు. ఖాళీ ప్లాట్లలో పేరుకు పోయిన పిచ్చి మొక్కలను ప్లాటు యజమానులు తొలగించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని, యజమానులు శుభ్రం చేయని పక్షంలో మున్సిపాలిటీ ద్వారా శుభ్రం చేయించి యజమానిపై జరిమాన విధించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. డ్రైన్లు ఎప్పటి కప్పుడు శుభ్రం చేస్తూ నీరు సాఫీగా వెళ్లే విధంగా చూసుకోవాలని సూచించారు. గోప్లాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదే గ్రామంలో నర్సరీని సందర్శించి వన మహోత్సవ కార్యక్రమానికి ఉపయోగిస్తున్న మొక్కలను పరిశీలించారు. రేమద్దుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించడమే కాకుండా విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న మాధ్యమంపై వివరాలు తెలుసుకొని విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం పాన్గల్ మండలంలో పర్యటించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాన్గల్ మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాల మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో సందర్శించి ధరణి దరఖాస్తుల పరిష్కారం పై వివరాలు తీసుకున్నారు. త్వరగా పరిష్కరించి ఆర్డీఓ లాగిన్ కు పంపించాలని తహసిల్దార్ ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, పానగల్ తహసిల్దార్, ఎంపీడీఓ తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.







# రైతు బంధుకు రాంరాం.. దళిత బంధుకు జై భీమ్

- రాష్ట్ర బడ్జెట్ పై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతు బంధుకు రాం రాం .. దళిత బంధు కు జై భీమ్ పలికారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దశ దిశ లేని బడ్జెట్ను రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టి ప్రజల ఆశలకు నీళ్లు చల్లారని విమర్శించారు. మహిళలకు 2500 మహాలక్ష్మి పథకం మాయమైందని, విద్యార్థులకు 5లక్షల భరోసా ఎటు వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నిరుద్యోగుల 4 వేల భృతి ఆశ లేకుండా పోయిందని రైతు కూలీల జాడ లేకపోగా కౌలు రైతుల ఊసే లేదని విమర్శించారు. కెసిఆర్ చెప్పిన విధంగా రైతుబంధుకు రామ్ రామ్ పలికి దళిత బందుకు జై భీమ్ అంటూ తెలంగాణలోని సబ్బండ వర్గాల ఆశల మీద నీళ్లు చల్లారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలకు సమయం వచ్చినప్పుడు ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# రాష్ట్ర బడ్జెట్లో మైనారిటీల సంక్షేమానికి 3003 కోట్లు

- సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే మెగారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మైనారిటీ నేతలు

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** రాష్ట్ర అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో మైనారిటీల సంక్షేమానికి 3003 కోట్లు కేటాయించి మైనారిటీలకు సముచిత గౌరవం దక్కించారని మైనారిటీ నేతలు మార్కెట్ డైరెక్టర్ లతీఫ్, నాయకులు మన్సూర్ అలీ, ఎండి. జాంగిర్, ఎండి. అస్లాం, సోఫీ, ఖదీర్, రజాక్, ఎస్.కె. అబ్దుల్లా అన్నారు. అలాగే 2024 -25 కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 2, 91, 159 కేటాయించి అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్థానిక శాసనసభ్యులు మేఘా రెడ్డి లకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపించిందని తెలంగాణలో బిజెపికి 8 ఎంపీ సీట్లు గెలిపించి ఇస్తే తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసినా రాష్ట్ర బిజెపి ఎంపీలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్, బిజెపి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు మానుకొని తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేలా కేంద్రంలో పోరాటం చేయాలని హితవు పలికారు.

# నేటి ఫోటో ఎక్స్పోలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

- జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ సంఘము

### అధ్యక్షుడు సుప్పాల శ్రీనివాస్

**ఫోకస్ న్యూస్ ప్రతినిధి, (స్టేట్ కోఆర్డినేటర్)-జూలై 25:**



నేటి నుంచి హైదరాబాద్ ఎల్బీ నగర్ కేబీఆర్ ఫంక్షన్ హాల్లో మూడు రోజులపాటు నిర్వహించే ఫోటో ఎక్స్పో కార్యక్రమంలో జిల్లాలోని ఫోటో వీడియో గ్రాఫర్స్ అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా ఫోటో వీడియో సంఘం అధ్యక్షులు సుప్పాల శ్రీనివాస్. గౌరవాధ్యక్షులు బిట్ల రాజు గురువారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీతో అందమైన ఫోటోలు తీస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ఎక్స్పోలో అన్ని రకాల వీడియో అండ్ ఫోటో కెమెరాలు మరియు ఆల్బమ్ డిజైన్ కు సంబంధించిన సీడీలు. ఫోటో ఫ్రేమ్లు. ఫోటో వీడియోకు గ్రాఫర్లకు సంబంధించిన నూతన టెక్నాలజీకి సంబంధించిన వస్తువులు దొరకడమే కాకుండా ఫోటోగ్రాఫర్లకు వారు వారు వాడుతున్న కెమెరాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఫోటోగ్రఫీ పై చైతన్య పరచడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్లు మరియు ఫోటో అండ్ వీడియో డిజైనర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఫోటో ఎక్స్పో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# కార్గిల్ వార్ సిల్వర్ జూబ్లీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** కార్గిల్ వార్ సిల్వర్ జూబ్లీ దినోత్సవాన్ని నేడు వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్లో ఘనంగా నిర్వహిద్దామని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. 3 మే1999 నుంచి 26 జూలై 1999 మధ్యకాలంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి చొర బడిన ఉగ్రవాదులను భారత సైనికులు వీరోచితంగా పోరాడి ఎంతోమంది వీర మరణం చెంది, మరెంతో మంది తీవ్ర గాయాల పాలై చివరికి భారతదేశం నుంచి ఉగ్రవాదులు, తీవ్రవాదులను తుదముట్టించి వెనక్కి పంపిన దినంగా పాటిస్తూ వీర మరణం పొందిన సైనికులకు నివాళిగా కార్గిల్ వార్ దినోత్సవాన్ని ప్రతి ఏటా మాజీ సైనికులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. కార్గిల్ వార్ జరిగి 25 సంవత్సరాలు గడుస్తుండడంతో ఈ ఏడాది సిల్వర్ జూబ్లీ వేడుకలు జరిపేందుకు మాజీ సైనికులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన మాజీ సైనికులు ఉదయం 10:30 గంటలకు రాజీవ్ చౌక్ కు చేరుకొని విజయవంతం చేయాలని కోరారు.




# వెల్నెస్ ఆసుపత్రిలో ఆరుదైన శస్త్ర చికిత్స

### వనపర్తి గాంధీ నగర్కు చెందిన మహిళకు ప్రాణం పోసిన వైద్యులు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** హైదరాబాద్ లోని వెల్ నెస్ ఆసుపత్రిలో ఓ మహిళకు వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి ప్రాణం పోశారు. వనపర్తి పట్టణంలోని గాంధీ నగర్ కు చెందిన నందిని అనే మహిళ కాన్పు కోసం ఓ ఆసుపత్రిలో చేరగా వైద్యులు సిజేరియన్ ఆపరేషన్ చేసి చిన్న తప్పిదం చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. సిజేరియన్ శస్త్ర చికిత్స చేసే సమయంలో చిన్న ప్రేగు గాయపడింది. దీంతో ఆమెకు 15 రోజుల తర్వాత పెరిటనైటిస్ వచ్చింది. దీంతో ఆ మహిళ తీవ్ర అనారోగ్యానికి గురై చిన్న ప్రేగు ద్వారా మలం పొట్టలో చేరి ఇన్ఫెక్షన్ వచ్చి జ్వరం, వాంతులు, పొట్ట ఉబ్బడం వంటివి చోటుచేసుకుని విషమ పరిస్థితికి చేరుకుంది. దీంతో ఆమె కుటుంబీకులు హుటాహుటిన మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని వెల్ నెస్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ఆమెకు అన్ని రకాల పరీక్షలు చేసి చిన్న పేగుకు జరిగిన గాయాన్ని గుర్తించి మొదట స్టోమ ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత రెండు నెలలు వేచి చూసిన తర్వాత ఆమె పూర్తిగా కోలుకున్న వెంటనే దెబ్బతిన్న చిన్న ప్రేగు భాగాన్ని తొలగించి అంతకుముందు బయట పెట్టిన చిన్న ప్రేగు భాగాన్ని కత్తిరించి రెండింటిని కలిపి చిన్నప్రేగును అతికించి రోగికి ప్రాణం పోశారు. ఈ పరిణామంతో తీవ్ర అస్వస్థతకు గురై విషమ పరిస్థితిలో ఉన్న నందిని కోలుకోవడంతో ఆమె కుటుంబ సభ్యులతో పాటు హైదరాబాద్ వెల్ నెస్ ఆసుపత్రి వైద్యుల బృందం బుధవారం వనపర్తిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మహిళ ప్రాణాలు కాపాడిన వైద్యుల సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్లు డాక్టర్ తాళ్ల సుమన్ గౌడ్, డాక్టర్ మహమ్మద్ అసద్ ఖాన్, డాక్టర్ తూర్పు వివేకానంద రెడ్డి, మార్కెటింగ్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, సునీల్ కుమార్, పటేల్ శ్రీనాథ్ బృందానికి రోగి బంధువులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

**నేటి ఫోకస్ న్యూస్, మేడిపల్లి:** రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్లో అధికారులు మరియు సిబ్బంది పనితీరు , సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలు సమీక్షించడానికి రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ మేడిపల్లి పోలీస్ స్టేషన్లో సందర్శించారు ఈ సందర్భంగా స్టేషన్ లోని రికార్డులను, రిసెప్షన్ , సీసీటీవీ,పెట్రోలింగ్ స్టాఫ్, పనితీరు అంశాలను సమీక్షించారు సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు మహిళా భద్రతకు అధిక ప్రాధాన్య ఇవ్వాలని సూచించారు ఈ కార్యక్రమంలో మేడిపల్లి సిఐ గోవిందా రెడ్డి, ఎస్సై కిష్టయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు





# వీధి కుక్కల సమస్య పరిష్కరిస్తాం

- మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**ఫోకస్ న్యూస్ ప్రతినిధి, (స్టేట్ కోఆర్డినేటర్)-జులై 25:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎనిమల్ కంట్రోల్ డ్రగ్స్ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన 315 జీవో ప్రకారం కుక్కల బెడదను నియంత్రించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా కమిషనర్ గోల్కొండ నరసయ్య లు అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తమకు ఫిర్యాదులు వస్తున్నాయని కుక్కల దాడిలో మనుషులకు ప్రాణాలకు హాని జరిగే విధంగా ఉన్నాయని రాష్ట్రంలో జరిగిన సంఘటన గుర్తు చేశారు కుక్కల బెడదను తగ్గించడానికి మున్సిపాలిటీలోని ప్రజలు సహకరించాలని పెంపుడు కుక్కలను వీధుల్లో తిరగకుండా కట్టడి చేసుకోవాలని కోరారు గుంపులు గుంపులుగా ఉన్న కుక్కల వద్దకు జనసంచారం ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆదేశించిన విధంగా మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కుక్కల బెడదను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జకీయోద్దీన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# అమ్మ మాట అంగన్వాడీ బాట

- స్పెషల్ ఆఫీసర్ మహంకాళి బుచ్చయ్య
- అంగన్వాడీ టీచర్లు లక్ష్మి రజిత చంద్రకళ

**తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 25:** మండలం కేంద్రం లోని చెర్లపాలెం గ్రామంలో గురువారం రోజున అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాటలో భాగంగా నిర్వహించిన ర్యాలీ ఇంటి ఇంటికి ప్రచారంలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ మహంకాళి బుచ్చయ్య అంగన్వాడీ టీచర్లు సంయుక్తంగా మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లో చిన్నపిల్లలకు పోషణతో కూడిన సత్తు పిండి, కోడిగుడ్లు , పోషకాలు ఉన్న ఆహారం అందుతుంది కాబట్టి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. అలాగే చిన్నపిల్లలు ఎత్తు బరువు ఇలా ఆరోగ్యంగా ఉన్నారా లేదా అని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. అంగన్వాడి సెంటర్లో నర్సరీ నుండి ఒకటవ తరగతి వరకు విద్యను అభ్యసించవచ్చు పిల్లల ఆరోగ్యంతో పాటు ఎత్తు బరువు వంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చును కనుక ప్రభుత్వం కల్పించే చక్కటి అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్, అంగన్వాడి టీచర్లు లక్ష్మి, రజిత, చంద్రకళ, డాక్టర్ స్వాతి, సిఏలు మంజుల, సువర్ణ, ఏఎన్ఎం ప్రేమలత, ఆశా వర్కర్లు ధనమ్మ, స్వరూప, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు ధర్మారపు శ్రీనివాస్, వెంకన్న, స్వప్న, అజీము, శానిటైజర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్ న్యూస్
శుక్రవారం 26, జూలై 2024

# ఖో ఖో నేపథ్యంలో మళయాల సినిమా..



**సినిమా ప్రియులను అలరించేందుకు కాస్త గ్యాప్** తర్వాత ఓ డబ్బింగ్ మలయాళస్పోర్ట్స్ డ్రామా చిత్రం ఖో ఖో డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. 2021లో విడుదలైన ఈ సినిమా మంచి పాజిటివ్ టాక్‌తో హిట్ చిత్రంగా నిలవడమే కాక, టీవీలో టెలికాస్ట్ అయి అత్యధిక టీఆర్పీ సాధించిన టాప్ 5 మలయాళ సినిమాల్లో ఒకటిగా రికార్డు సృష్టించింది. రాహుల్ రిజి నాయర్ రచనతో పాటు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాజీషా విజయన్, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. కత విషయానికి వస్తే.. కేరళలోని ఓ మారుమూల గ్రామంలోని ప్రభుత్వ మహిళల స్కూల్‌లో పీఈటీగా జాయిన్ అవుతుంది మరియా ఫ్రాన్సిస్. ఈ క్రమంలో ఆమె అక్కడి పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ఓ ఖో ఖో టీమ్‌ను తయారు చేస్తుంది. ఈ నేపథ్యంలో మరియాకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి, పిల్లలు టీచర్‌కు సహకరించారా, మధ్యలో టీచర్ ట్రాన్స్‌ఫర్ అయ్యాక ఏం జరిగిందనే ఆసక్తికరమైన కథకథనాలతో సినిమా ఇంటిల్లిపాదిని అలరిస్తుంది. ఇప్పుడు ఈ సినిమా ఈటీవీ విన్ ఓటీటీలో తెలుగులో మన ముందుకు వచ్చింది. ఎక్కడా ఎలాంటి అసభ్యత, వల్గారిటీ లేకుండా రూపొందించిన ఈ సినిమాను ఫ్యామిలీ మొత్తం హాయిగా చూసి అస్వాదించవచ్చు. చిత్రంలో ఖోఖో ప్లేయర్స్‌గా నటించిన వాల్లంతా రియల్ లైఫ్‌లోనూ ఖోఖో ప్లేయర్స్ కావడం గమనార్హం

# నారా రోహిత్ సుందరకాండ




**నారా రోహిత్ హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి** దర్శకత్వంలో 'సుందరకాండ' చిత్రం తెరకెక్కుతుంది. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి ఈ ఫన్ ఫిల్డ్ రోమ్-కామ్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈచిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్నారు నారా రోహిత్. అయన నటిస్తున్న 20వ చిత్రమిది. నేడు నారా రోహిత్‌కి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో రోహిత్ ఇన్నోసెంట్ లుక్స్‌లో కూల్ డ్రెస్‌లో క్లాసీ, ఛార్మింగ్ గా కనిపించారు. చక్కని ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతుందని మేకర్స్ తెలిపారు. త్వరలో టీజర్‌ను త్వరలో విడుదల చేయనున్నారు. నారా రోహిత్ సరసన విర్తి వాఘని హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీ దేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రదీప్ ఎమ్ వర్మ సినిమాటోగ్రఫీ అందించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు.

# గూఢాచారి సీక్వెల్‌గా జీ2

**టాలీవుడ్ హిస్టరీలో ల్యాండ్ మార్క్‌గా** నిలిచిపోయే సినిమాల జాబితాలో ముందు వరుసలో ఉంటుంది గూడఛారి. అడివిశేష్ టైటిల్ రోల్ పోషించిన ఈ మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే ఫ్రాంఛైజీలో ఈ చిత్రానికి కొనసాగింపుగా జీ2కూడా వస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మేజర్ సినిమాకు ఎడిటర్‌గా పనిచేసిన వినయ్ కుమార్ సిరిగినీడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. కాగా గన్స్ యాక్షన్ మూడ్‌లోకి దిగితే.. అంటూ డైరెక్టర్ వినయ్ కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు మేకర్స్. వినయ్ కుమార్ చేతిలో పిస్టోల్ పట్టుకున్న తాజా స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన జీ2 (ఉ2) ఫస్ట్ లుక్ పోస్టర్‌తోపాటు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియో సినిమాపై సూపర్ క్యూరియాసిటీ పెంచుతోంది. షూటింగ్ కొనసాగుతున్నట్టు తెలియజేశారు. అడివి శేష్ ఈ మూవీలో మరోసారి స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నట్టు ప్రీ వెర్షన్ అనౌన్స్ మెంట్ వీడియోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా జీ2 చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు. జీ2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల కానుంది.




# జంధ్యాల మార్క్.. మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం




**దర్శకుడు లక్ష్మణ్ కార్య ఇంతకు** ముందు 'హ్యాపీ వెడ్డింగ్' అనే సినిమాకి దర్శకత్వం వహించాడు. అయితే ఆ సినిమా ఆశించినంతగా నడవలేదు, కానీ లక్ష్మణ్ కార్య దర్శకత్వ పటిమ ఏంటో ఆ సినిమా ద్వారా తెలిసింది. అందుకే ఇప్పుడు రెండో సినిమాగా 'మారుతీనగర్ సుబ్రమణ్యం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాకి లక్ష్మణ్ కార్య దర్శకత్వంతో పాటు, రచన, మాటలు, స్క్రీన్ ప్లే కూడా అందించారు. ఈ సినిమా త్వరలోనే విడుదలవుతుందని తెలుస్తోంది. అయితే ఈ సినిమా గురించి పరిశ్రమలో ఒక టాక్ బయలుదేరింది. అదేంటంటే ఈ సినిమాని ఇప్పటికే కొంతమంది పరిశ్రమలోని వారు చూసారని, ఈ సినిమా చూసిన తరువాత నవ్వ కుండా ఉండలేరు అని అంటున్నారు. ఈ సినిమాలో రావు రమేష్ ప్రధాన పాత్ర పోషించారు. మామూలుగానే ప్రేక్షకులు ఒక సినిమాలో క్యారెక్టర్ పాత్రలో కనపడే రావు రమేష్ చెప్పిన మాటలని ఎంతో ఆస్వాదిస్తారు, అలాంటిది ఇప్పుడు అయన ప్రధాన పాత్రలో చేస్తున్న సినిమాలో అతని చెప్పే మాటలకి పడి పడి నవ్వాల్సిందే అని ఈ సినిమా చూసిన వాళ్ళు చెపుతు న్నారు. ఇంకొక ఆసక్తికర అంశం ఏంటంటే ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీస్ మేకర్స్ కూడా చూసా రని, అందుకే వాళ్ళు ఈ సినిమాని టేక్ అప్ చేసారని ఒక వార్త నడుస్తోంది. అలాగే ఈ సినిమా ప్రముఖ దర్శకుడు సుకు మార్ కూడా చూసి ఎంతో ఆస్వాదించారని తెలుస్తోంది. ఇం దులో రావు రమేష్ లాంటి నటుడికి ఒక ఫుల్ లెంగ్త్ రోల్ ఇస్తే తన మాటలతో ఎలా ప్రేక్షకులని మంత్రం ముగ్దుల్ని చేస్తాడో ఈ సినిమా నిరూపిస్తుంది అని కూడా అంటున్నారు. హింసా త్మక సినిమాలతో ప్రేక్షకుడికి ఊపిరి ఆడక ఉన్నటువంటి ఈ సమయంలో ఈ 'మారుతీనగర్ సుబ్రమణ్యం' ప్రాణవాయువు లాంటిదని అంటున్నారు.